

# లిటిల్ రాస్కెల్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**"నిజమే చెప్తున్నాను నీరజా"**

నీరజని దగ్గరకి తీసుకోబోయాడు సాంబశివరావు. నీరజ వెంటనే దూరంగా జరిగింది.

"మిమ్మల్ని పెళ్ళి చేసుకోబోయేముందు ఆలోచించాను. ఇంకోసారి ఆలోచించి వుండాల్సింది."

సాంబశివరావుకి ఏం మాట్లాడాలో అర్థంకాలేదు. "నేను చెప్పింది నిజం" చెప్పాడు బలహీనంగా.

"మీరు నన్ను మోసం చేసారు. నిలువునా దగా చేసారు. పెళ్ళి ముందే మీ ప్రేమ వ్యవహారం గురించి చెప్పాల్సిన బాధ్యత మీ మీద వుంది. చెప్పలేదు. మీకో కొడుకున్నాడని చెప్పాల్సిన బాధ్యత మీమీదుంది. చెప్పలేదు. ఇది నూటికి నూరుపాళ్ళు అన్యాయం చేయడం. మీరు పరమ దుర్మార్గులు, కిరాతకులు. మీలాంటివాళ్ళు వుండబట్టే ఆడవాళ్ళు కిరసనాయిలు పోసుకుని, నిప్పంటించుకుని, మాడి మసి అయి నిస్సారంగా బూడిదవుతున్నారు. మీలాంటి చవటలవల్లే, మీలాంటివాళ్ళవల్లే ఆడవాళ్ళు ఉరివేసుకుని పండంటి జీవితాన్ని భూమికి నాలుగడుగుల లోతును అంకితం చేసుకుంటున్నారు."

"ప్లీజ్! నీరజా అలా మాట్లాడకు."

"మాట్లాడతాను. గుండె ధైర్యంలేనివాళ్ళు అన్యాయానికి తలవంచి అగ్నిపాలవుతున్నారు. ఏం న్యాయమండీ యిది. పెళ్ళి ఒకరితో సంసారం యింకొకరితోనా? నా కళ్ళకి మీరు రావణాసురుడి కలియుగావతారంలా కనిపిస్తున్నారు. మహిషాసురుడి మరో అంశంలా అనిపిస్తున్నారు."

"నీరజా.."

"యు ఆర్ ఎ ఛీట్, యు ఆర్ ఎ లయర్. యు ఆర్ ఎ నంబర్ వన్ స్కాండ్రల్. యు ఆర్..."

"నీరజా ప్లీజ్. పోట్లాటలు ఎక్కువకాలం బ్రతకవు. కాని మాట్లాడిన మాటలు మాత్రం ఎప్పటికీ చావవు."

నీరజ బలవంతంగా తన దుఃఖాన్ని ఆపుకుంది. కళ్ళు తుడుచుకుంది.

"ఐ ప్రామిస్ యు. వాడు నా కొడుకు కాదు" చెప్పాడు సాంబశివరావు నీరజ తలమీద చెయ్యివుంచి.

భర్తచేతిని విసురుగా తోసేసి పేలవంగా నవ్వి చెప్పింది నీరజ.

"హుఁ! ఒట్టు అనేది కేవలం సైకలాజికల్ ట్రిక్. నేను సైకాలజీ స్టూడెంటునని మర్చిపోకండి. దయచేసి బయటికి వెళ్ళండి. నన్ను కాసేపు ఒంటరిగా వుండనివ్వండి."

"ఆవేశం తగ్గాక నార్మల్‌గా ఆలోచించు. వాడు నా కొడుకు కాదన్న సంగతి నీకే అర్థమవుతుంది."

సాంబశివరావు బయటకి వెళ్ళిపోయాడు. నీరజ తమ గది తలుపువేసి లోపల బోల్టు పెట్టుకున్న చప్పుడు సాంబశివరావుకి వినపడింది గుమ్మం దాటి నాలుగడుగులు వేయగానే.

దశరథరామయ్య బయటికి వచ్చిన కొడుకువంక ఏమిటన్నట్లుగా చూసాడు.

"నమ్మటంలేదు" చెప్పాడు సాంబశివరావు.

"నేను వెళ్ళిపోనాండి?" అడిగాడు రాజేష్ బితుకు బితుకుమంటూ చూస్తూ.

"చెప్పరా, నిజం చెప్పు నిన్నెవరు పంపించారు యిక్కడికి?" గద్దిస్తూ అడిగాడు సాంబశివరావు.

"మా అమ్మ" రాజేష్ కళ్ళల్లో భయం గూడు కట్టుకుని వుంది.

"మీ అమ్మ నీకు అబద్ధం చెప్పింది. నేను నీకు తండ్రిని కాను. వెళ్ళి మీ అమ్మనే అడుగు మీ నాన్న ఎవరో. రేపు ఉదయం కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో మీ ఊరు పంపించేస్తాను."

"మీరు ఎలా చెపితే అలాగేనండి" చెప్పాడు రాజేష్ తలవంచుకుని.

"వెరీ బేడ్ హనీమూన్ నుంచి వచ్చిన మొదటిరోజే ఇలా జరగటం ఎంతమాత్రం బాగోలేదు" చెప్పాడు దశరథరామయ్య.

తన రాకవల్ల ఆ ఇంట్లో ఏదో జరుగుతోందని గ్రహించిన రాజేష్ గోడకి అతుక్కుపోయినట్లుగా ఓ మూల నిశ్శబ్దంగా కూర్చుండిపోయాడు. తల వంచుకుని ఎడం ముంజేతిమీద వున్న ఉడతపిల్లని కుడిచేతి చూపుడు వేలితో నిమురుతున్నాడు నిశ్శబ్దంగా.

"నువ్వు విజయవాడలో ఎవర్నో చేసుకోవాలనుకున్నావు. ఒకవేళ ఆ అమ్మాయి" అర్థోక్తిగా ఊపాడు సాంబశివరావు.

"ఆమె నాకు పరిచయం అయి రెండేళ్ళు కూడా కాలేదు నాన్నగారూ."

దశరథరామయ్య చుట్టని వెలిగించాడు.

"నేనలా బయటికి వెళ్ళొస్తాను" చెప్పాడు సాంబశివరావు చెప్పులు తొడుక్కుని. సాంబశివరావు వెళ్ళగానే బన్ని వస్తుందనే భయంతో దశరథరామయ్య తలుపేసుకుని లోపల గడియపెట్టాడు. పడక్కుర్చీలో పడుకుని కళ్ళు మూసుకుని కోడలితో ఎలా మాట్లాడాలా అని ఆలోచించసాగాడు.

అయిదారు నిముషాలు గడిచాక రాజేష్‌కి ఎంతో వంటరిగా అనిపించింది. తనొక్కడే ఆ ఇంట్లో వున్న ఫీలింగ్. తన తాతయ్య, నాన్న వున్న ఇంటికి తల్లి పంపిస్తోందనే నమ్మకంతో వచ్చాడు. కానీ పరిస్థితి అందుకు పూర్తిగా విరుద్ధంగా వుండటంతో రాజేష్‌కి వెంటనే తన తల్లి దగ్గరికి వెళ్ళిపోవాలని వుంది. తనకంటూ వున్న, తనను ప్రేమించే తల్లికి దూరంగా వుండటం దుర్భరంగా వుంది రాజేష్‌కి.

తాతయ్య కూడా తనతో మాట్లాడకపోవడంతో దుఃఖం తన్నుకువస్తోంది. ఎప్పుడు దుఃఖం వచ్చినా, 'దాన్నించి దూరంగా వుండాలంటే మనకిష్టమైనవి గుర్తుతెచ్చుకోవాలి. అప్పుడు సంతోషం వేస్తుంది' అని తల్లి చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. తన కిష్టమైన వాటితో తల్లి తయారు చేసిన గేయం చదవసాగాడు. ఆ ఇంట్లో తనని ఆవరించిన వంటరితనాన్ని పారద్రోలే, తనకి సన్నిహితమైన వాటిని గుర్తుతెచ్చుకుంటూ ఆ గేయం తనకి తాను చెప్పుకోసాగాడు రాజేష్.

నాకిష్టం నాకిష్టం ఇవి నాకిష్టం
పులిపిల్ల చిన్న మీసం
ఏనుగు పిల్లతో సావాసం
గిరగిర తిరిగే ఎర్ర బొంగరం
ప్రత్యూషలో అగుపించే అంబరం
నా కిష్టం నా కిష్టం ఇవి నా కిష్టం

పచ్చటి అడవిలో తిరిగే కుందేలు

చల్లటి నీటిలో ఈదే కుందేలు

నెమలి ఫించం వున్న కృష్ణుడి కిరీటం

వద్దన్నా ఆగక పడిలేచే కెరటం

నా కిష్టం నాకిష్టం ఇవి నాకిష్టం

వేసవికాలం దాటాక తొలిజల్లు

విచారాన్ని తుడిచే కన్నీళ్ళు

మృత్యుహరణం రామ చరణం

దుఃఖ హరణం రామబాణం

నా కిష్టం నాకిష్టం ఇవి నా కిష్టం

శోకపు మనసుకిది అమ్మ ముద్దు

ఆకలి కడుపుకి....

ఇక ఆపుకోలేక రాజేష్ లేచి బాత్‌రూంలోకి పరిగెత్తాడు.

కళ్ళు మూసుకుని రాజేష్ గేయం వింటున్న దశరథరామయ్య లేచి బాత్‌రూం వైపు అడుగులు వేసాడు. లోపలనించి రాజేష్ వెక్కిళ్ళు వినపడ్డాయి. ఆయన మనస్సు కలుక్కుమంది.

మృదువుగా తలుపు తట్టాడు.

కొన్ని క్షణాల్లో తలుపులు తెరిచాడు రాజేష్. ఏడుపుతో భుజాలు ఎగిరెగిరి పడుతున్నాయి.

"మీరు బాత్‌రూంకి వెళ్ళాలా?" ఎక్కిళ్ళ మధ్య అడిగాడు.

రాజేష్‌ని దగ్గరకి తీసుకుని చెప్పాడు.

"మీరేమిటి? నువ్వు అను. ఏడవకు. నీకెవరు నేర్పారు ఆ పాట?"

"అమ్మ"

"బావుంది. ఏదీ ఇంకోసారి పాడు."

"మీకు బావుందా? ఎప్పుడైనా ఏడుపొస్తే ఇది పాడుకోమని నేర్పింది. చాలాసార్లు ఇది పాడుతుంటే ఏడుపురాదు తాతయ్యా.. తాతయ్యా, నిన్ను తాతయ్యా అని పిలవచ్చా?"

"వద్దని ఎవరన్నారు? అలాగే పిలు"

"తాతయ్యా! నీవు నిజంగా నా తాతయ్యవి కావా? అడిగాడు రాజేష్.

"చిన్నపిల్లలందరికీ నేను తాతయ్యనే"

"మరి సాంబశివరావుగారు నాన్నగారు కాదా?"

దశరథరామయ్య ఆ ప్రశ్నకి సమాధానం చెప్పలేదు.

"మరి అమ్మ ఎప్పుడూ అసత్యం పలకరాదు అని చెప్తుంది కదా. ఈ విషయంలో ఎందుకు అబద్ధం చెప్పింది తాతయ్యా?" అడిగాడు.

"మీ నాన్నగారి పేరు సాంబశివరావే, కానీ ఆ పేరుగలవాళ్ళు చాలామంది వుంటారుగా?"

"ఇంకో సాంబశివరావుగారా? నీవు అడుగు తాతయ్యా."

"ఎవరిని"

"మీ అబ్బాయిని"

"ఏమని?"

"నాకన్నా సాంబశివరావుగారే నీకు ఎక్కువ కాలనించి తెలుసుగా, మా అమ్మ చెప్పింది నిజం అవునో కాదో కనుక్కో తాతయ్యా"

"అలాగే. ఇంకెప్పుడూ ఏడవకు."

"ఏడుపొస్తేనే ఏడుస్తా తాతయ్యా"

"మరి బాత్ రూంకొచ్చి ఎందుకేడుస్తావ్?"

"అందరిముందు ఏడవకూడదని, అలా ఏడిస్తే మర్యాద కాదని అమ్మ చెప్పింది, అందుకే."

"మీ అమ్మకూడా ఏడుస్తుందా?"

"అప్పుడప్పుడు. వెళ్దాం తాతయ్యా. ఏడుపు పోయింది. మీతో మాట్లాడాక."

ఇద్దరూ బయటకి రాగానే హాలు గుమ్మం దగ్గర నిలబడి చూస్తున్న నీరజ వారికంట పడింది. ఏడవటం వల్ల ఆమె మొహం ఉబ్బి, కళ్ళు ఎర్రబడి వున్నాయి.

"రాజేష్ మాట" పిలిచింది నీరజ.

ఏమిటన్నట్లుగా చూసాడు రాజేష్.

"అమ్మ ఫోటో వుందా నీ దగ్గర?"

"లేదండి" చెప్పాడు.

"ఎలా వుంటుంది అమ్మ?"

రాజేష్‌కి సమాధానం తెలీలేదు ఆ ప్రశ్నకి. అందుకే మౌనంగా వుండిపోయాడు.

"మీ అమ్మ ఏం చేస్తుంటుంది?"

"స్కూల్లో టీచర్."

"ఏ స్కూల్లో?"

"లిటిల్ ఫ్లవర్. మా వూళ్ళో"

నీరజ దశరథరామయ్య వంక చూసింది.

"నిజంగా మీకు రాజేష్ గురించి ఇదివరకు తెలియదా? ఆయన చెప్పలేదా?" అడిగింది.

"లేదు." తల అడ్డంగా వూపాడు.

"ఆడదానికి వివాహం అయ్యేదాకా తనకి ఎలాంటి భర్త అక్కరలేదో తెలుసుకోలేదు" చెప్పింది బాధగా.

"లేట్స్ నాట్ జంప్ ఇన్ టు కంక్లూషన్స్" సానుభూతిగా చెప్పాడు దశరథరామయ్య.

నీరజ తన గదిలోంచి బయటకి రాదని, పక్కమీదే పడుకుని వుంటుందనుకున్న సాంబశివరావుకి ఆమెలోని మార్పు ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించాయి.

ఇంటికి చీకటిపడ్డాక తిరిగి వచ్చాక చూస్తే నీరజ అసలేం జరగనట్లే వుంది. కాఫీ కలిపి తీసుకొచ్చింది. రాజేష్ ప్రసక్తి తీసుకురాలేదు.

"ఇవాళ సెకండ్ షోకి వెళ్దాం అనుకున్నాం. వెళ్తున్నామా?" అడిగాడు సాంబశివరావు.

"మీ ఇష్టం" చెప్పింది.

నీరజ ఎనిమిదిన్నరకల్లా భోజనం వడ్డించింది అందరికీ.

"మిమ్మల్ని ఏమని పిలవాలి ఆంటీ?" అడిగాడు రాజేష్ సందిగ్ధంగా.

ఒకో ముద్ద తింటూ చెప్పసాగాడు అతను. "ఇది తాతయ్య ముద్ద, ఇది అమ్మ ముద్ద, ఇది నాన్న ముద్ద, పిన్ని ముద్ద ఇది శ్రీరాముని ముద్ద. ఇకనించి నా ముద్దలు."

'ఇది నాన్న ముద్ద' అనగానే నీరజ, దశరథరామయ్య యిద్దరూ సాంబశివరావు వంక చూశారు. అతని మొహంలో కొద్దిగా యిబ్బంది తొంగిచూసింది.

"తాతయ్యా! చిన్నప్పుడు నాన్నగారు అన్నం దగ్గర పేచీ పెట్టేవారు కదా? ఏది వేసినా 'ఇంకాస్త వెయ్యి' అని గొడవ చేసేవారట కదా? ఎంత వేసినా 'ఇంకా ఇంకా' అంటే ఓసారి మీకు కోపం వచ్చి నాన్నగారి కంచం నిండా మజ్జిగపులుసు వంచి 'మొత్తం తిను. తినకపోతే నోటికేసి కడతాను అన్నారట కదా? అప్పుడు నాన్నగారు కొంచెం తిని 'తినలేను నాన్నా అని ఏడిస్తే 'తిను. తినకపోతే చంపేస్తాను' అని మీరు దగ్గరే కూర్చున్నారట కదా?" అడిగాడు అతను హాయిగా నవ్వుతూ.

"నీకెలా తెలుసు?" దశరథరామయ్య వెంటనే అడిగాడు.

"మజ్జిగ పులుసు చూస్తే గుర్తొచ్చింది" చెప్పాడు.

నీరజ భర్త మొహం వంక చూసింది. సాంబశివరావు మొహంలో కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు. రాజేష్ వంక సంభ్రమంగా చూస్తున్నారు.

"మీ అమ్మ చెప్పిందా?" అడిగాడు దశరథరామయ్య.

"అవును. అమ్మా, నేను రోజూ ఉదయం అన్నం గబగబా తిని స్కూలుకి వెళ్తాం. రాత్రిళ్ళు మాత్రం టైముంటుంది కాబట్టి కబుర్లు చెప్పుకుంటూ నెమ్మదిగా తింటాం. నేను ఏదైనా ఎక్కువ వెయ్యి అని మారాం చేస్తే 'తాతయ్య మీ నాన్నగారికి చేసినట్లు చెయ్యనా?' అంటుంది" నవ్వాడు.

దశరథరామయ్య కోడలి మొహం వంక చూశాడు. ఎంతో నిరాశక్తిగా వుంది నీరజ మొహం.

"మా అమ్మ కూడా ఇలాగే చేస్తుంది" చెప్పాడు అతను నీరజతో.

"మాట్లాడకుండా తినవచ్చుగా" కసిరాడు సాంబశివరావు.

"ఆ పని మీరు చెయ్యొచ్చుగా" నీరజ సాంబశివరావుని కసిరింది.

"అదికాదు..."

"అది అవును. మీకేదైనా ఎక్కువ కావాలి అనే మనస్తత్వం చిన్నప్పటినుంచీ వుందన్నమాట?"

అకస్మాత్తుగా హాయిగా వున్న వాతావరణం సీరియస్‌గా మారడం గమనించాడు రాజేష్. వెంటనే మౌనంగా వుండిపోయాడు. సాంబశివరావు తనతో తెచ్చుకున్న పుస్తకంలోకి దృష్టి మరల్చి తినసాగాడు.

"నాన్నగారికి అన్నం తినేటప్పుడు ఇలా పుస్తకం చదవటం అలవాటట. ఏం లేకపోతే రైల్వే టైం టేబుల్ చదువుతూ అన్నం తింటారట. అమ్మ చెప్పింది" చెప్పాడు రాజేష్ కాసేపాగి.

సాంబశివరావు తల ఎత్తి రాజేష్ వంక తీవ్రంగా చూశాడు. ఆ చూపులకి బెదిరిపోయిన రాజేష్ వెంటనే కంచంలోకి తల దించుకున్నాడు.

భోజనాలయ్యాక బట్టలు తొడుక్కుని స్కూటర్ బయటకు తీశాడు.

"నేను రావటంలేదు" చెప్పింది నీరజ.

"అదేం? ఇందాక వస్తానన్నావుగా?"

"వస్తాననలేదు. మీ ఇష్టం అన్నాను."

"అంటే వస్తానన్నట్లేగా?"

"కాదు. ఇప్పుడు నా యిష్టం. రావాలనిలేదు. సారీ మీరు వెళ్ళి రండి"

"నీరజా నువ్వు."

"టైం వృధా చేసుకోకండి. నన్ను కన్విన్స్ చేయలేరు."

"ఆల్‌రైట్. అయితే నేను వెళుతున్నాను."

సాంబశివరావు కోపంగా బయటికి నడిచాడు. దశరథరామయ్యకి ఎంతో బాధగా వుంది. ముచ్చటగా వుండాల్సిన ఆ దంపతుల మధ్య అలకలకి.

వంటగదిలో తన కంచం తీసి కడిగి తోముతున్న రాజేష్‌తో చెప్పింది నీరజ.

"తప్పు. చిన్నపిల్లలు ఇలాంటి పనులు చేయకూడదు."

"ఇక్కడికి పంపబోయేముందు మా అమ్మ ఇవన్నీ నేర్పి పంపించింది. మీకు ఇబ్బంది కలిగించకూడదని మరీ చెప్పింది."

"నేనున్నట్లు తెలుసా మీ అమ్మకి?"

"తెలుసండీ"

"అంత దూరం నుంచి నిన్ను ఒంటరిగా పంపించింది కదా! దారిలో ఏమైనా అయితే?"

"మేరీ ఆంటీ స్టేషన్‌కి వస్తుందని చెప్పింది. కానీ రాలేదు. అమ్మ వ్రాసిన ఉత్తరం ఆంటీకి అంది వుండదు."

"మేరీ ఆంటీ ఎవరు?"

"మా అమ్మ స్నేహితురాలు"

"క్షేమంగా చేరాక నిన్ను ఉత్తరం రాయమనలేదా మీ అమ్మ?"

"తాతయ్యతో చెప్పి టెలిగ్రాం పంపించమందండి. మరిచిపోయాను.

"అడ్రస్ వుందా?"

"ఉంది. కాగితంలో రాసిచ్చింది."

నీరజ చేతిలోని బక్కెట్‌ని నేలమీద పెట్టి ఆత్రంగా అడిగింది.

"ఏదీ?"

రాజేష్ తన సూట్ కేస్ దగ్గిరకి వెళ్ళి అందులోంచి ఓ పుస్తకం తీశాడు. ఆ పుస్తకంలో మడిచి వున్న కాగితం తీసి నీరజకి అందించి చెప్పాడు.

"అమ్మ ఈ అడ్రస్‌కి టెలిగ్రాం ఇమ్మని చెప్పమంది."

ఆత్రంగా ఆ కాగితంలోని చిరునామాని చదివింది నీరజ.

వి.సభాపతి, ముసలయ్య కిళ్ళీ షాపు ప్రక్క సందులో, నియన్ చర్చ్, హనుమాన్ పేట విజయవాడ.

మరోసారి ఆ చిరునామా చదివి అడిగింది అతడిని.

"మీ అమ్మ పేరు సభాపతా?

"కాదు."

"మరి సభాపతి ఎవరు?"

"మా ఇంటాయన."

"మీరు హనుమాన్ పేటలో చర్చ్ దగ్గర ఇంట్లో అద్దెకుండేవారా అడిగింది నీరజ.

"అవును. సభాపతిగారి ఇంట్లో."

"ఆయనేం చేస్తారు?"

"పడక్కుర్చీలో పడుకుంటూంటారు"

"అంటే? ఆఫీస్‌కి వెళ్ళరా?"

"ఊహూ."

"మీ నాన్నగారి ఫోటో మీ ఇంట్లో వుండేదా?"

"లేదు."

"గోడకి కాదు. నీకు తెలియకుండా మీ అమ్మ పెట్టెలో వుండేదేమో?"

"మా అమ్మ పెట్టె నేనెన్నోసార్లు చూశాను. లేదు. వుంటే అడిగినప్పుడు చూపించేదిగా?"

"మీ నాన్నగారి ఫోటో చూపించమని అడిగావా?"

"అడిగాను. నన్ను యిక్కడికి పంపబోయేముందు అమ్మ నన్ను ఫోటో స్టూడియోకి తీసుకెళ్ళి నా ఫోటో తీయించింది."

"అలాగా?"

నీరజ కాసేపు ఆ సమాచారం గురించి ఆలోచించి అడిగింది.

"మీ యిద్దరూ కలిసి తీయించుకున్నారా?"

"నేను ఒక్కడ్నే."

"మీ నాన్న ఎప్పుడూ మీ ఇంటికి రానేలేదా?"

"ఊహూ."

"నీ చిన్నప్పుడు వచ్చారేమో?"

"చిన్నప్పుడు నాన్నగారు మా ఇంట్లోనే వుండేవారట. బదిలీ అయి యిక్కడికి వచ్చేశారని చెప్పింది అమ్మ."

"బదిలీ అయి ఎంతకాలం అయింది?"

"ఏమో?"

నీరజ మనసులో లెక్కవేసుకుంది. సాంబశివరావుకి విజయవాడనించి అయిదేళ్ళ క్రితం గుంటూరు బదిలీ అయింది. గుంటూరు నుంచి సంవత్సరం క్రితం హైదరాబాద్ బదిలీ అయింది. అంటే రాజేష్‌కి రెండు, రెండున్నర వయసులో విజయవాడలో వున్నాడు.

"మీ నాన్నగారినుంచి ఉత్తరాలేమైనా వస్తుండేవా?" అంది.

"ఊహూ."

"ఆయన నీకు ఎవరిచేతనయినా బట్టలు, బిస్కట్స్, పుస్తకాలులాంటివేమైనా పంపిస్తూండేవారా?"

"లేదు"

"మీ నాన్నగారి ఫ్రెండ్స్ ఎవరయినా మీ ఇంటికి వస్తుండేవారా?"

"ఉహూ. ట్యూషన్ పిల్లలు మాత్రం వస్తుండేవారు.

"ఎంతమంది?"

"పొద్దున్న ఇద్దరు, సాయంత్రం ఆరుగురు."

"మీ నాన్నగారినుంచి నెలనెలా డబ్బు మనియార్డర్ వచ్చేదా?"

"ఏమో? అమ్మ ఎప్పుడూ చెప్పలేదు నాకు."

నీరజకి యింకేం అడగాలో తెలియలేదు. కాసేపు మౌనంగా ఆలోచిస్తూండిపోయింది.

రాజేష్ భయం భయంగా చూస్తూ అడిగాడు.

"ఆంటీ నాన్నగారు అమ్మని పెళ్ళి చేసుకున్నారు కదా? మా దగ్గరికి రాకుండా మళ్ళీ మిమ్మల్ని ఎప్పుడు పెళ్ళిచేసుకున్నారు?"

నీరజ ఆ ప్రశ్నకి సమాధానం చెప్పలేదు.

"మా సంగతి మీకు తెలియదా ఆంటీ?" అడిగాడు మళ్ళీ.

"నాకు తెలియదని నీకెలా తెలుసు?" అడిగింది నీరజ.

"తెలిస్తే మీరు ఈ పెళ్ళి చేసుకునేవారా?" ప్రశ్నించాడు రాజేష్.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in